


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు





సంపుటి : 12 సంచిక : 11 జూలై 2007



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


పాలకొల్లు .......... 01-01-07

జిన్నూరు ............ 31-05-07

చిలుకూరు ........ 18-04-07



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## గురు పూర్ణిమ

గురు పరంపరలో ప్రధముడిగా ఆరాధింపబడే శ్రీ వ్యాస భగవానుని స్మరించి, ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నట్లుగానే త్వరలో గురుపూర్ణిమ ఉత్సవాన్ని జరుపుకోబోతున్నాం. సకల చరాచర సృష్టికి ఆధారమై, హృదయంలో సచ్చిదానంద స్వరూపంగా ఉన్నట్టి గురు తత్త్వాన్ని పరమ ప్రేమ, భక్తి, కృతజ్ఞతతో మననం చేసుకొంటూ, మన పరమ గమ్యానికి పునరంకితం కావలసిన రోజు. దైవము, గురువు, ఆత్మ ఒకే సద్వస్తువైయున్నారని భగవాన్ శ్రీ రమణ మహర్షి బోధించారు. మానవాళిపై కరుణ, ప్రేమతో అట్టి పరమ చైతన్యమే మానవాకృతులను ధరించి, సద్గురువులుగా, వారి బోధ ద్వారా మానవాళిని భ్రాంతి రూపమైన అజ్ఞానము నుండి అంతిమ సత్యంలోనికి మేల్కొలుపుతారు. గురువు ఒక ఉపాధిలో ఉన్నా, ఆ ఉపాధి గురువు కాదు. శాంతి ధామమైన హృదయాన్ని చేరుటకు గురు కృప అత్యంత కీలకము. ఈ సృష్టిలో మహోపకారి గురువు మాత్రమే! గురువు 'దేహాత్మబుద్ధి'ని తొలగించి మన స్వరూపమైన ఆత్మజ్యోతిని దర్శింపజేస్తారు. రాబోయే గురుపూర్ణిమ సందర్భంగా నిజమైన భక్తి, ప్రేమ, వినయముతో మన గురువు నిర్దేశించిన మార్గానికి, గురు బోధకు పునరంకితం అవుదాం. గురు బోధ ద్వారా గురుతత్త్వంతో మనకు గల అభేదత్త్వాన్ని అనుభవంలోనికి తెచ్చుకొనుటయే మానవ జీవిత గమ్యం!

- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం

# సద్గురు వైభవం

భగవంతుడు తన సృష్టి ఎడల ప్రేమతో సద్గురువు రూపంలో జన్మిస్తాడు. ఆయనను ప్రేమించే అదృష్టవంతులమైతే ఏదో ఒకనాడు మన నిజస్థితిని దర్శించగల్గుతాము. గురువు యొక్క అనుగ్రహం ద్వారానే సాధకుడు అహంకారం యొక్క కుయుక్తులను విజయవంతంగా ఎదుర్కొని విజయం సాధిస్తాడు. సత్య సాక్షాత్కార ప్రయత్నములో గురువు లేని సాధన అక్కడక్కడా ఆగే గూడ్సు రైలు ప్రయాణం లాంటిది. సురక్షితమైనది కాదు. గురు సహాయంతో ఉన్నవారు సరాసరి వెళ్ళే సూపర్‌ఫాస్ట్ రైలు ప్రయాణం లాంటిది. సద్గురువు తన శిష్యుల మనస్సులో ఉంటూ చైతన్యాన్ని జాగృతం చెయ్యటానికి ఎవరికి ఎప్పుడు ఏ సహాయం అవసరమో వారికి ఆ సహాయం చేస్తూ అసాధారణమైన ఫలితాలను కలుగజేస్తాడు. మనం గురు ప్రేమను తప్ప మరి దేనినీ కోరుకోకూడదు. ఆయనకు మనం విధేయత చూపటంతో మన గమ్యాన్ని చేర్చే పని మరింత తేలిక అవుతుంది. మన చేతలలో నిజాయితీ ఉండాలి. ఎవ్వరికీ దుఃఖం కలిగించకూడదు. ఇతరుల ఆనందానికి కారణం కావటం, సామాన్య జీవితాన్ని గడుపుతూ, ఉన్నతమైన ఆలోచనల (ఆత్మతత్త్వం)తో ఉండటం, స్వార్థపూరితమైన విషయ కోరికలకు లోబడకుండా ఉండటం అవసరం. మన గురువు పట్ల భయభక్తులతో పూర్తి అర్పణభావంతో ఉండాలి. గురువు నా స్వంతమే అన్నంత సన్నిహితం కలిగి ఉండాలి. తన చంటి బిడ్డను తల్లి దూరంగా ఉంచినా తల్లిని కరుచుకొని బిడ్డ ఎలా ఏడుస్తూ వదలకుండా ఉంటుందో గురువు పట్ల శిష్యుడు అలా ఉండాలి. భగవంతుని ఉగ్ర కోపాన్ని శమియింపజేయవచ్చును కాని గురు తృణీకారం నుంచి పుట్టిన పాపాన్ని భగవంతుడు కూడా క్షమించడు. గురువు దుఃఖ దశను చూడడు, సుఖ స్థితిని ఆపేక్షించడు కార్య సాఫల్యముచే సంతోషంగాని, కార్య విఫలతతో దుఃఖం గాని పొందడు. ఎవరు తన దర్శనం చేత, స్పర్శచేత, శబ్ద ప్రయోగం చేత సత్యానుభవం కలుగజేయునో వారే సద్గురువు. కాని ఇవి అన్ని స్వప్రయత్న కృషితో తీవ్ర సాధన చేయువారిగా, గతంలో కాని ఇప్పుడుగాని ఉండి ఉంటే వారు కాల పరిపక్వమైన పుణ్యచరితులు అయితే పై గురువు క్రియలు వెంటనే ఫలిస్తాయి. మామూలు నీటి బొట్టు ముత్యపు చిప్పలో పడితే కృషితో ముత్యం కావటం లేదా? గురు అనుగ్రహంతో కూడిన మాటలు మననంతో ఆచరిస్తే రత్నాలుగా మనం ఎందుకు మారము? మారతాము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-01-07, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈశ్వరుడి దయలేకపోతే మనకు మోక్షానికి దారి కనబడటం చాలా కష్టం, అది మన తెలివితేటల వలన కనబడేదికాదు. లోపల చైతన్యం ఉండటం వలననే ఈబుద్ధి పనిచేస్తోంది, ఇంద్రియాలు పనిచేస్తున్నాయి, ఈశరీరం పనిచేస్తోంది. అంతర్యామిగా ఈశ్వరుడు లేకపోతే ఇవన్నీ జడమే. దేహము నేను అనే తలంపు మనకు ఎంతకాలం అయితే ఉందో అంతకాలం ఈ ఇష్టాలకు, అయిష్టాలకు, లోకానికి సంబంధించిన గొడవలకు దూరంగా ఉండటం చాలా కష్టం అంటే లోకప్రభావం మన మీద పడకుండా చూసుకోవటం చాలా కష్టం. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే శాస్త్రాలు చాలామంది చదివినా అవి వారికి సరిగా అర్థంకాదు ఎందుచేతనంటే రాగద్వేషములు పెట్టుకొని చదువుతారు. రాగద్వేషములతో శాస్త్రం చదివినా తన హృదయాన్ని మనకు ఇవ్వదు. ఎవరైనా మనతో హృదయపూర్వకంగా మాట్లాడుతూ ఉంటే వారికి మన హృదయం ఇచ్చి మాట్లాడాలనిపిస్తుంది. మనం కపటంగా మాట్లాడుతున్నాము అనుకోండి అది వారికి తెలుస్తూ ఉంటుంది, వారు కూడా కపటంగానే మాట్లాడతారు. మనం శాస్త్రాన్ని గౌరవించి శాస్త్రాన్ని చదువుతూ ఉంటే శాస్త్రం తన హృదయాన్ని మనకు ఇస్తుంది గాని మన మనస్సులో దోషాలు పెట్టుకొని, మనస్సులో ఏదో ఊహించుకొని శాస్త్రాన్ని చదవటం వలన శాస్త్రం తన హృదయాన్ని మనకు ఇవ్వదు.

పూర్వంకంటే ఇప్పుడు టెక్నాలజీ అభివృద్ధి అయ్యిందికాని మనిషిలో సత్వగుణం లేకుండాపోతోంది. సత్వగుణం లేకుండా మీరు భగవద్గీత చదివినా, శ్రవణం చేసినా అది మీకు అర్థం కాదు. సత్వగుణం మనకు మోక్షానికి దారిచూపిస్తుంది, భగవదనుభవం కలుగజేస్తుంది. మీరు సత్సంగాలు బాగా నడుపుతున్నారు, సంఘసేవ బాగా చేస్తున్నారు అని ఎవరైనా అంటే ఆ పొగడ్తలే నిజం అనుకొని వాటితో కలిసిపోతారు అనుకోండి, మీరు ఎంత పండితులు అయినా కూడా మోక్షమార్గం తప్పిపోతారు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తూ ఉంటే వారు విమర్శిస్తున్నారు అని అస్తమాను అనుకొంటూ ఉంటే అప్పడు కూడా మీరు మోక్షమార్గం తప్పిపోతారు. ఇవన్నీ భరించినవాడే, సహనంగా ఉన్నవాడే భగవంతుడి స్వరూపాన్ని పొందుతాడు. మనోనిగ్రహం కోసం పూజలు చెయ్యమని, జపాలు చెయ్యమని, ధ్యానం చెయ్యమని పెద్దలు చెపుతారు. మీకు ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి. అసలు మనస్సు బయటకు వెళ్లదు. మనస్సును కంట్రోలు చేసుకోవటానికి అభ్యాసం, వైరాగ్యం అవసరమని భగవంతుడు చెప్పాడు. మీరు అభ్యాసం చేస్తారు అనుకోండి, వివేకం లేకపోతే అభ్యాసం నిలబడదు. మేము సాధన చేస్తున్నాము, మేము సాధన చేస్తున్నాము అంటే సరిపోదు.

మీకు ఏదైనా తలంపు ఎక్కువగా వస్తోంది అనుకోండి, ఎందుకు అలా వస్తోంది, ఆ తలంపు వలన ఎక్కడ నష్టపోతున్నాము అనే వివేకం అవసరం. శరీరం ఉండగా శరీర పోషణకోసం ఏదో సంపాదించుకొంటున్నాము. శరీరం చనిపోయిన తరువాత మన కూడా వచ్చే గుణాల మాట ఏమిటి? మంచిగుణాలను మనం సంపాదించుకొంటున్నామా అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. కొంతమందికి గౌరవం అంటే చాలా ఇష్టం, అది మరీ ప్రమాదం. మేము వారికి సహాయం చేసాము, ఈ సంస్థకు సహాయం చేసాము అని చెపుతూ ఉంటారు. ఇలా అనుకోవటం వలన గర్వం పెరిగిపోతుంది. నువ్వు ఎవడవు సహాయం చెయ్యటానికి? కొంతమందికి సహజంగానే సమాజానికి సహకరించే అలవాటు ఉంటుంది, వారికి గర్వం రాదు. మీకు సామాజికస్పృహ ఉండటం మంచిదే కాని దానివలన దేహభావన పెరిగిపోతూ ఉంటే స్మశానం వరకు వెయ్యిమంది రావచ్చు, గోడలమీద మీ పేర్లు వ్రాయవచ్చు అంతే, మరణానంతర జీవితం మాత్రం సున్న. గౌరవం, అగౌరవం వచ్చి మిమ్మల్ని ముట్టుకొంటున్నాయి అనుకోండి, మీ మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది కాని లోపలకు వెళ్ళదు. మనస్సు లోపలకు వెళితేగాని ఈశ్వరదర్శనం సాధ్యం కాదు. మనలో ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు. మన మూడు అవస్థలలో ఏమి జరుగుతోందో చూస్తున్నాడు. మహాత్ములమీద, మహర్షులమీద, అవతారపురుషుల మీద మనకు గౌరవం కూడా లేదు, గౌరవం ఉన్నట్లు నటిస్తున్నాము, మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు ఇదంతా చూస్తున్నాడు.

మా ఇంట్లోవారికి అర్థమయ్యేలాగ అన్నీ చెపుతున్నాను, అయినావారు నా మాట వినటం లేదు, నాకు దుఃఖం వస్తోంది అని చెపుతారు. మా కుటుంబంలో వ్యక్తి చనిపోయాడు, నాకు దుఃఖం వస్తోంది అని చెపుతారు. ఇలా మీకు ఏదో కారణం వలన దుఃఖం రావచ్చు. మీలో దుఃఖపడేవాడు ఉన్నంతకాలం దుఃఖం వస్తూనే ఉంటుంది, వాడు ఉన్నంతకాలం పునర్జన్మలు వస్తూనే ఉంటాయి, మీకు శవాలను మోయటం తప్పదు. మీలో రాగద్వేషములు ఉన్నప్పుడు ఒక మనిషిని అర్థం చేసుకోవటంకాని, శాస్త్రాన్ని అర్థంచేసుకోవటం కాని, ఈశ్వరుడిని అర్థం చేసుకోవటం కాని సాధ్యంకాదు, దేనినీ మీరు ప్రోపర్‌గా అర్థం చేసుకోలేరు. ఈశ్వరుడు అంటే మహాశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, ఆయనకు తెలియని విషయం అంటూ ఏమీ లేదు, ఆయనకు భిన్నంగా ఏమీలేదు. మనకు ఏదైనా కోరిక నెరవేరింది అనుకోండి, మనకు చాలా సంతోషం వచ్చేస్తుంది. కోరికలతోటి, విషయాలతోటి సంబంధం లేకుండా ఆనందం, శాంతి ఆయనకు ఎప్పుడూ ఉంటుంది, వాడు దేవుడు. కర్మయోగం అంటే నీవు ఏ పని చేసినా నిర్మలంగా, నిశ్చలంగా చెయ్యి, స్వార్థం లేకుండా చెయ్యి. మనం అందరం ఏమి చేస్తున్నాము అంటే భక్తి పేరుమీద స్వార్థం పెంచుకొంటున్నాము కాని స్వార్థాన్ని తగ్గించుకోవటం లేదు. ఇంతవరకు ఈ

సృష్టిలో ఏ స్వార్థపరుడికీ ఆత్మజ్ఞానం కలుగలేదు. మనం నేచురల్‌గా, నార్మల్‌గా పనిచేస్తాము అనుకోండి దానివలన వికారాలు ఏమీ రావు. కోరికలతో సంబంధం లేకుండా మనం భగవంతుడిని సహజంగా ప్రేమిస్తూ ఉంటే, నేచురల్‌గా నార్మల్‌గా భగవంతుడిపట్ల మనకు భక్తి ఉంటే ఆయన మోక్షాన్ని మనకు ఇస్తాడు. మనం అడిగితే ఇవ్వడు, మనకు అర్హత వచ్చింది అనుకోండి, మనం అడగటంతో సంబంధం లేకుండా మనకు మోక్షాన్ని ఇస్తాడు, వాడు దేవుడు. మీరు తెల్లబట్టలు కట్టుకొన్నారా, ఎర్రబట్టలు కట్టుకొన్నారా అని కాదు, రాగద్వేషములు లేనివాడు వాడు గృహస్థాశ్రమంలో ఉన్నా సన్యాసే, వాడు నిత్యసన్యాసి అని పరమాత్మ చెప్పాడు.

చనిపోయిన తరువాత ఏదో చేద్దాము, ఏదో వస్తుంది అని అనుకోవటం కాదు. ప్రతీ మనిషి కూడా వాడిలో కోరికల వేగం ఎంత ఉంది, కోపం యొక్క వేగం ఎంత ఉంది అని లోపల పరిశీలన చేసుకోవాలి. ఈ శరీరం శవం అవ్వకముందే కోరికల యొక్క వేగం, కోపం యొక్క వేగం ఈ రెండింటిని తగ్గించుకోవాలి. వాటి వేగం తగ్గదు అనుకోండి మిమ్మల్ని పునర్జన్మలు వెంటాడతాయి. మనకు కోరికలు వచ్చినా, కోపం వచ్చినా అది మనలో ఉన్న పాపానికి గుర్తు. మనలో ఏ దోషం లేదు అనుకోండి కోరికతో పని లేదు, కోపంతో పని లేదు. దేశభక్తి కూడా కోరికే కదా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. దేశభక్తి కూడా కోరికే అయినప్పటికీ అది హృదయాన్ని విశాలం చేస్తుంది. మన ఇంట్లో ఉన్న రూపాయలు నిజమైన సంపద కాదు. ఈ హాలులో కొంతమందికి కోట్ల రూపాయలు ఉన్నాయి. మీరు శాంతిగా ఉన్నారా అంటే శాంతిగా లేరు. మన ఇంట్లో ఉన్న రూపాయల కంటే మనకు అదృష్టవశాత్తు మంచిస్నేహాలు దొరికాయి అనుకోండి, వారే మనకు నిజమైన ధనం. స్నేహితులను బట్టి బాగుపడినవారు ఉన్నారు, స్నేహితులను బట్టి పతనమైనవారు ఉన్నారు. చెడ్డస్నేహాలే దారిద్ర్యం, మంచిస్నేహాలే ఐశ్వర్యం. మనకు ఇంటి నిండా డబ్బు ఉంది అనుకోండి, ఎటు చూసినా చెడ్డ స్నేహితులు అనుకోండి, వారివలన మనకు మిగిలేది దుఃఖం, అశాంతి, వారివలన పునర్జన్మలను పెంచే వాసనలు పెరుగుతాయి. భక్తులందరికీ ఒక విజ్ఞప్తి ఏమిటి అంటే మనం రోజూ చేసుకొనే పని ఉంటుంది కదా, ఆ పని మానేసి కూర్చొంటే జ్ఞానం వచ్చేస్తుంది అనుకొంటున్నారు. పని మానేసి కూర్చొంటే జ్ఞానంరాదు, సోమరితనం వస్తుంది, తమోగుణం పెరిగిపోతుంది. సాధన అంటే మనలను ఏ తలంపులు అయితే బంధిస్తున్నాయో, భగవదనుభవం కలుగకుండా ఏ బలహీనతలు అయితే మనకు అడ్డువస్తున్నాయో వాటితోపోరాడటమే సాధన. మనం ఎలా పోరాడాలి అంటే భగవంతుడు మనకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేసుకొంటూ, భగవంతుడి మీద భక్తిని పెంచుకొంటూ, ఎంతోకొంత సత్కర్మ చేస్తూ, సత్పురుషులతో సహవాసం చేస్తూ ఉంటే ఆ బలహీనతలు, వాసనలు నశిస్తాయి కాని ఏమీ లేకుండా సోమరితనంగా కూర్చొంటే వాసన

నశించదు. పైన ఉన్నది తీయకుండా నీకు లోపల ఉన్నది ఎలా కనిపిస్తుంది అంటాడు స్వామీజీ. నీ మనస్సుతో కల్పించుకొన్న గొడవలు అన్నీ పైన ఉన్నాయి, వస్తువు లోపల ఉంది. మనస్సు కల్పించిన గొడవలు అన్నీ తీసి ఒక ప్రక్కన పెట్టు అప్పుడు లోపల ఉన్న వస్తువు నీకు గోచరిస్తుంది.

నేను ఏదైనా సత్కర్మ చేస్తూ ఉంటే అది నన్ను గమ్యానికి చేరుస్తుందా అని ఒకరు భగవాన్‌ను అడుతున్నారు. నీవు సత్కర్మ చేస్తూ ఉంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, అప్పడు గమ్యానికి చేరుకొంటావు. మనకు మాటలో, పనిలో, ఆలోచనలో చిత్తశుద్ధిలేదు, చిత్తశుద్ధి లేకుండా మోక్షం రాదు. వారు అలాగ ఉన్నారు, వీరు ఇలాగ ఉన్నారు, మనం వారిలా ఉండాలి, వీరిలాగ ఉండాలి అనుకొంటాము. ఇలా అనుకరణ వలన ఎవడికీ మోక్షం రాదు. మీరు మీరులాగ ఉంటే మీకు మోక్షం వస్తుంది. వారు ఆ బట్టలు కట్టుకొన్నారు, మనం కూడా అవి కట్టుకొందాము, వారు ఆ బంగారు నగలు పెట్టుకొన్నారు, మనం కూడా అటువంటివి పెట్టుకొందాము అనుకొంటే దీని అర్థం ఏమిటి అంటే లోకం యొక్క ప్రభావం, సమాజం యొక్క ప్రభావం నీ మీద పడుతోంది. ఎందుకు పడుతోంది అంటే అక్కడ నీకు ఏదో ఇష్టం ఉంది. ఇలా సృష్టి యొక్క ప్రభావం నీ మీద ఎంతకాలం అయితే పడుతుందో అంతకాలం నీవు ఈ సృష్టిని అతిక్రమించలేవు. నీవు నీవులాగ ఉండటం మానేసి ఎవరిలాగో ఉంటాను అంటావు ఏమిటి? ఇప్పడు ఎవరో వచ్చి మనలను ఏదో పని చెయ్యమంటారు అనుకోండి, ఆ పని అక్కడ అవసరం లేకపోయినా గొప్పలకోసం చేస్తాము. మనం అందరం ఎటువంటివారము అంటే గంగానది ప్రక్కన నుయ్యి తవ్వుతాము గాని, ఆ నుయ్యి అవసరమైన చోట తవ్వము, మన బుద్ధి అటువంటిది. ఇక్కడ మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే నువ్వు ఏ పని చేసినా ఈశ్వర ప్రీత్యర్థం చెయ్యి. మనం లోకంలో గొప్పలకోసం, గుర్తింపులకోసం పనులు చేస్తూ ఉంటే మనం పతనమైపోతాము. నేను ఇంత సేవ చేస్తున్నాను, ఎవరూ గుర్తించటం లేదు అంటారు అంటే వాడు గుర్తింపులకోసం చేస్తున్నాడు కాని ఈశ్వర ప్రీత్యర్థం చేయటం లేదు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నువ్వు ఏదైనా సత్కర్మ చేస్తే అది నిరాడంబరంగా, నిర్మలంగా, నిరహంకారముగా చెయ్యాలి. నువ్వు ఆ మంచి పని చేయటం వలన నిన్ను ఎవరైనా స్తోత్రం చేస్తారు అనుకో అప్పడు నీకు వికారం కలిగితే నువ్వు లోపల అహంకారం పెట్టుకొని చేసినట్లే. లోపల ఉన్న అహంకారానికి ఈ సంతోషం అందిపోతోంది అంటే దానికి బయటనుండి మేత అందిపోతోంది, ఇంక అప్పడు అది పెరిగిపోతుంది కాని అది నశించదు.

భగవంతుడి యొక్క ప్లానింగు మనకు తెలియదు. ఆయన ముందు మన తెలివితేటలు ఎంత? మన జీవితం ఎంత? భీష్ముడు బ్రహ్మచారి, గొప్ప భక్తుడు అని లోకానికి తెలుసు. ఆయన యొక్క పాండిత్యం, ఆయనకు ఎంత అనుభవం ఉందో అది లోకానికి తెలియదు.

భీష్ముడి యొక్క పాండిత్యం, భీష్ముడికి తెలిసిన భగవంతుడి యొక్క వైభవం లోకానికి తెలియజేయటం కోసం ధర్మరాజుతో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీ తాతగారి దగ్గరకు వెళ్ళి ధర్మశాస్త్రం నేర్చుకో అంటాడు. ఆయనే చెప్పవచ్చు, వ్యాసుడిచేత చెప్పించవచ్చు కాని భీష్ముడిచేత చెప్పించటం ఏమిటి అంటే భీష్ముడి యొక్క వైభవం లోకానికి తెలియజేయటం కోసం అది భగవంతుడి యొక్క ప్రణాళిక. మంచి చేసైనా ఉండాలి, మంచి చూసైనా ఉండాలి అని పెద్దలు అంటారు. మనకు రెండూ లేవు. మనం మంచి చేయనక్కరలేదు, మంచి చూడనక్కరలేదు కనీసం మంచివారిని గౌరవించే యోగ్యత కూడా మనకు లేదు. చిత్తశుద్ధి లేకుండా, మనస్సులో నిర్మలత్వం, నిశ్చలత్వం, ఏకాగ్రత లేకుండా, లోపల ప్రిపరేషన్ లేకుండా నీకు ఆత్మజ్ఞానం లభ్యం కాదు. మనం ఏదైనా మాట్లాడుతూ ఉన్నా, పని చేస్తూ ఉన్నా అక్కడ చిత్తశుద్ధి ఉందో లేదో అని మనలో ఉన్న అంతర్యామి చూస్తూ ఉంటాడు, అది దేవుని కోర్టు. అదే టాగూర్ చెపుతాడు ఇక్కడ కోర్టులలో మనం తప్పించుకొన్నా దేవుని కోర్టులో తప్పించుకోలేము. నాకు మోక్షం కావాలి అని భగవాన్‌తో అంటే నాకు మోక్షం కావాలి అని నీలో ఎవడైతే అంటున్నాడో వాడిని బయటకు తోసెయ్యి, అప్పుడు ఉన్నదే మోక్షం, ఉన్నదే శాంతి, ఉన్నదే ఆనందం. నువ్వు జపం చెయ్యి, ధ్యానం చెయ్యి, విచారణ చెయ్యి, ఏదోరకంగా వాడిని బయటకు గెంటు అంతకంటే నీవు చేయవలసింది ఏమీలేదు. నీకు ఎప్పుడైతే సత్యానుభవం కలిగిందో ఈ లోకం, దేవుడు అన్నీ హృదయంలో అణిగిపోతాయి.

గౌతమబుద్ధుడిని లోకం చాలా అపార్థం చేసుకొంది. బుద్ధుడు చేసిన త్యాగం ఈ సృష్టిలో ఎవడు చేసాడు, తన పినతల్లికి సన్యాసం ఇచ్చాడు, భార్యకు సన్యాసం ఇచ్చాడు, కుమారుడికి సన్యాసం ఇచ్చాడు, తను చనిపోయాక ఈ రాజ్యానికి ఎవరు వారసులో అందరికి సన్యాసమిచ్చాడు. ఇటువంటి త్యాగమూర్తి పురాణాలలో ఎవడైనా ఉన్నాడేమో చూడండి. దేవుడు ఉన్నాడా అని బుద్ధుడిని ఎవడైనా అడిగితే ఆయన ఉన్నాడు అని చెప్పలేదు, లేడని చెప్పలేదు, మౌనంగా ఉన్నాడు. అసలు సత్యం ఉన్నది అని చెప్పటానికి, లేదని చెప్పటానికి అతీతంగా ఉంది, అందుచేత మౌనంగా ఉన్నాడు అది అర్థం చేసుకోలేక బుద్ధుడిని చాలామంది నాస్తికుడు అని విమర్శలు చేసారు. చార్లెస్ డికెన్స్ ఒక నవల వ్రాసాడు. మనం కష్టపడకుండా ఏదీ రాదు అని ఆ నవల సారాంశం. మనం కష్టపడకుండా ఏదైనా తెచ్చుకొన్నా మరల అది పోతుంది. మనం కష్టపడకుండా లోకవిషయాలే మనం సాధించలేము ఇంక మోక్షం ఎలా వస్తుంది? కష్టపడకుండా లోకవిషయాలే రానప్పుడు మరి మోక్షం కోసం ఇంకెంత కష్టపడాలి అన్నాడు. కృష్ణుడు చేసిన కొన్ని పనులు మనకు అర్థం కావు. అందుచేత కృష్ణుడు అలా చేసాడు ఏమిటి అని మనకు అనిపిస్తుంది. అలా ఎందుకు చేసాడో ఆయనకు తెలుసు కాని మనకు తెలియదు.

అది మన మనస్సుకు అందదు. ఆయన మన కొలతలకు అందనివాడు, వాడే దేవుడు. కాఫీ తాగి ఫ్యాను కింద కూర్చొని కృష్ణుడు చేసిన పనుల మీద జడ్జిమెంట్లు ఇవ్వకూడదు. అలా జడ్జిమెంట్లు ఇస్తే మనం పతనమైపోతాము. ఆయన పాదాలను ఆశ్రయిస్తే మనకు మోక్షం వస్తుంది. కృష్ణుడు చేసిన పనులు మీ మనస్సుకు నచ్చకపోయినా ఆయన పాదాలను విడిచిపెట్టవద్దు, ఆయన యందు భక్తి కాపాడుకోవాలి. ఎందుచేతనంటే భక్తిని కాపాడుకొంటే మనకు సత్వగుణం వస్తుంది. సత్వగుణం జ్ఞానానికి దారి చూపిస్తుంది. కొంతమంది పని మొదలుపెడతారు, చిరాకుగా విసుగ్గా పనిచేస్తూ ఉంటారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు చేసేపని చిరాకుగా చెయ్యకు, చేసే పని ప్రేమగా చెయ్యి అంటున్నారు. నువ్వు ఎవరికైనా ఏదైనా ఇచ్చేటప్పుడు నిర్లక్ష్యంగా, గర్వంగా, నేను ఏదో పెద్దవాడిని అనుకొంటూ ఇవ్వవద్దు. అలా నేను ఏదో పెద్దవాడిని అనుకొంటూ పనిచేస్తూ ఉంటే నువ్వు చేసేది మంచిపని అయినా నీ లోపల రజోగుణం, తమోగుణం పెరిగిపోతాయి, నీవు పతనమైపోతావు.

ఈ సృష్టిలో ఎవడిని ఏ విషయంలోను ఆక్షేపించవద్దు, ఎవరిని అగౌరవపరచవద్దు. మీరు ఎవడినైనా ఆక్షేపిస్తే ఆ ఆక్షేపించిన కారణం మరల మీ కుటుంబంలోనికి వచ్చి తీరుతుంది, ఇది భగవంతుడి చట్టం, ఇది మర్చిపోవద్దు. ఎవడైనా అందహీనంగా ఉంటాడు అనుకోండి, అందహీనమైన వాడిని మీరు ఆక్షేపిస్తారు అనుకోండి, అందహీనమైన వాడే మీ కుటుంబంలో పుడతాడు. మీరు ఏదైనా మంచిపని చేస్తున్నా, దానికి మీరు అవలంభించే మార్గం కూడా మంచిగా ఉండాలి. లేకపోతే మీ మైండ్ పొల్యూట్ అయిపోతుంది. మనం ఏదైనా పని చేసినప్పుడు ఒకోసారి ఫలితం వస్తుంది, ఒకోసారి ఫలితం రాదు. ఫలితం వచ్చినప్పుడు ఎలా ఉంటామో, రానప్పుడు కూడా అలాగే ఉండాలి. ఈ రెండింటిలో తేడా వస్తోంది అనుకో నీకు చిత్తశుద్ధి రాదు, మోక్షం కలుగదు. భగవద్గీతలో చెప్పిన ఇది ఒక్కటీ మీరు అర్థం చేసుకోండి. ఈ ద్రోణాచార్యుడిని ఎలా చంపగలను, తాతగారు భీష్ముడిని ఎలా చంపగలను అని అర్జునుడు కృష్ణుడిని అడుగుతాడు. అప్పుడు కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే వీరందరినీ ఎలా చంపగలను అని నీవు అంటున్నావు. నువ్వు ఎవరినైతే చంపాలి అనుకొంటున్నావో వారినందరిని నేను చంపిపోగులు పెట్టి ఉంచాను. నువ్వు ఊరికే చేతులు ఆడించు, పని నాది, గౌరవం నీది అంటాడు. భగవంతుడు అంటే ఏమిటో మీరు అర్థం చేసుకోండి. ఇది ఒక్క అర్జునుడికే కాదు, మనకు కూడా వర్తిస్తుంది. జీవితంలో మనం ఏదైనా సాధించినా అది ఈశ్వరసంకల్పాన్నిబట్టి సాధించాము కాని మన తెలివితేటల వలన సాధించలేదు. ఏదో మన తెలివితేటలతో సాధించాము అనుకొంటే మీరు పతనమైపోతారు. మీలో సాధనచేసేవారు ఇక్కడ చాలామంది ఉన్నారు. కొంతమంది ఉదయాన్నే లేచి స్నానం చేసి పూజ చేస్తేనేగాని

కాఫీ తాగరు, ఆ నిష్ఠ మంచిదే కాని మీ అందరికి ఒక ప్రార్థన ఏమిటి అంటే మేము సాధన చేస్తున్నాము, బాగుపడిపోతున్నాము, మోక్షానికి దగ్గరగా వెళ్ళిపోతున్నాము. చాలామందికి పూజలేదు, జపంలేదు, వారు పాడైపోతున్నారు అని ఇటువంటి పిచ్చగొడవలు మీ బ్రెయిన్‌లోనికి రానివ్వవద్దు. అలా మీరు అనుకొంటూఉంటే ఎవరైతే పాడైపోయారు అని అనుకొంటున్నారో భవిష్యత్‌లో వారికంటే ముందు మీరు పాడైపోతారు. అది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మీకు దుఃఖం వస్తోంది అనుకోండి. ఎవడికో దుఃఖం వస్తోంది, ఆ దుఃఖపడేవాడిని నేను కాదు, నా స్వరూపంలో దుఃఖం లేదు అనే భావన మీకు బలపడితే దుఃఖం యొక్క వేగం తగ్గిపోతుంది. మీరు దేవాలయానికి వెళితే వెళ్ళండి మంచిదే. అంతేగాని ఎవరో దేవాలయానికి రావటం లేదు, వారు ఎందుకు పనికిరారు, వారు పాడైపోతున్నారు, ఇటువంటి గొడవలు అనుకోవద్దు, ఆ గొడవలు మీకు అనవసరం. ఇలా అనుకొంటే గుడికి వెళ్ళనివారు బాగానే ఉంటారు, మీరు పాడైపోతారు. మనం పెద్ద విషయాలలో జాగ్రత్తగానే ఉంటాము, ఇటువంటి చిన్న విషయాలలో అజాగ్రత్తగా ఉంటాము. చిన్నచిన్న విషయాలలో కూడా బహుజాగ్రత్తగా ఉండాలి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 31-05-07, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

దక్షిణామూర్తి మౌనంగానే బోధించేవాడు. మౌనం కూడా భాషా శ్రవంతి. దక్షిణామూర్తి మౌనంతో భక్తుల సందేహాలు పోగొట్టి, వారికి శాంతిని ప్రసాదించేవాడు. దక్షిణామూర్తి అంటే శివుడి యొక్క అవతారం. కొంతమందికి సొంత ఆలోచన ఉండదు, ఎవరైనా ఏదైనా చెపితే అది భుజాన వేసుకొని తిరుగుతారు. అది అవివేకానికి గుర్తు. మనం ఏదైనా ఒక మార్గంలో ప్రయాణం చేస్తున్నాము అనుకోండి, ఆ మార్గం మంచిది కాదు అని ఎవరైనా చెపితే అది నిజం అనుకొంటాము, మనకు స్థిరబుద్ధి లేకపోవటం వలన అలా అనిపిస్తుంది. అవివేకం ఉన్న మనిషికి ఏది మంచి, ఏది చెడ్డ అనే విచక్షణ ఉండదు, ఏది స్వీకరించాలి, దేనిని త్యజించాలి అనే తేడా వాడికి తెలియదు. స్నేహాలు కూడా తగుమాత్రంగా ఉండాలి. అతిగా చేస్తే మనస్సుకు బంధం కలుగుతుంది, మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. ఇవి అన్నీ అవివేకంగా ఉన్నప్పుడు మనకు తెలియదు. పశులక్షణాలు లేకుండా అసలు మనిషి ఉండడు. అయితే కొంతమందిలో పశులక్షణాలు ఎక్కువగా ఉంటాయి, కొంతమందిలో తక్కువగా ఉంటాయి. మనలో ఉన్న పశులక్షణాలను తగ్గించుకోవటానికే సాధన. ఎంతో క్రమశిక్షణ ఉంటేనేగాని, ఆహారనియమం, వాక్కునియమం, మనోనిగ్రహం ఉంటేనేగాని మనలో ఉన్న పశులక్షణాలు తగ్గవు. మనం ఏమి చేస్తున్నాము అంటే మనలో ఉన్న పశులక్షణాలు తగ్గలేదు, మనకు ఆత్మజ్ఞానం కావాలి అని కోరుకొంటున్నాము. మనలో ఉన్న పశులక్షణాలు నశిస్తేనేగాని

మనకు ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. మనకు రూపబుద్ధి, నామబుద్ధి పోలేదు. ఒక రూపంతోటి, నామంతోటి, పరిసరాలతోటి నీకు తాదాత్మ్యం ఉన్నంతకాలం నీవు కోటిజన్మలు ఎత్తినా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. డబ్బాలో బియ్యం కదలకూడదు, ఇంట్లో మనుషులు దుంగల్లా ఉండాలి అని అనుకోవటం ఎటువంటిదో రూపబుద్ధి, నామబుద్ధి పోకుండా ఆత్మజ్ఞానం కావాలి అని అనుకోవటం కూడా అటువంటిదే. మీరు ఏ మార్గంలో ఉన్నా రూపబుద్ధి, నామబుద్ధి నశించకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. సాధనచేసి, సాధనచేసి ఎవడైతే పశులక్షణాలను తగ్గించుకొంటున్నాడో వాడిని పూర్ణమానవుడు అంటారు, వాడిలో మానవత్వం వికసిస్తుంది, అప్పుడు మనస్సు భగవంతుడి వైపుకు తిరుగుతుంది. ఇల్లు కట్టుకోవటానికి సిమ్మెంట్, ఇసుక, ఇటుకలు, ఇనుము, కలప ఇవి అన్నీ సమకూర్చుకొంటే గాని మనం ఇల్లు కట్టలేము. అలాగే ఆత్మజ్ఞానానికి ఏవి అయితే అవసరమో అవి అన్నీ సమకూర్చుకొంటేగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఇల్లుకట్టుకోవటానికే ఇంత గొడవ ఉన్నప్పుడు మరి ఎంత క్రమశిక్షణ ఉంటే ఎంత సాధన ఉంటే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుందో మీరు చూసుకోండి. మనకు క్రమశిక్షణ లేదు అనుకోండి, సాధన లేదు అనుకోండి, జ్ఞానం మాట వదిలేయండి, పశులక్షణాలు కూడా తగ్గవు. వివేకం ఉన్నవాడికి ఏది అవలంభిస్తే మంచిది, ఏది మన సాధనకు ఉపయోగపడుతుంది, దేని వలన చెడ్డవస్తుంది అనే విచక్షణ ఉంటుంది. మనం వివేకం ఎంత వరకు పెంచుకొంటున్నాము అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. వివేకం పెరిగే కొలది మనస్సుకు లోచూపు కలుగుతుంది. అందరికి గురువులు అయిపోవాలి అని ఉంది. ఎవరికి శిష్యులుగా భక్తులుగా ఉండటం ఇష్టం లేదు. గౌతమబుద్ధుడు అంతటివాడు ఇల్లు త్యాగం చేసాడు, రాజ్యం త్యాగం చేసాడు, బుద్ధగయ వచ్చి తపస్సు చేసి జంతులక్షణాలను పోగొట్టుకొని జ్ఞాని అయ్యాడు. తరువాత సారనాథ్ వచ్చి బోధించటం మొదలుపెట్టాడు, గురువు అయ్యాడు. ఆయన చెప్పిన మాటలు కలకాలం, చిరకాలం నిలబడి ఉన్నాయి. మనం ఏమీ పోగొట్టుకోకుండా ముందు గురువు అయిపోవాలి అనుకొంటున్నాము, ఏదో నలుగురిని పోగేసుకోవటం, దుకాణం పెట్టటం, గురువు అయిపోవటం, ఇదో సరదాగా ఉంది. ఆత్మజ్ఞానం లేనప్పుడు వాడు గురువు ఎలాఅవుతాడు, జంతులక్షణాలు పోనప్పుడు వాడు గురువు ఎలా అవుతాడు.

వివేకం ఉన్నవాడు సాధన చేస్తాడు. ఏది సత్యం, ఏది అసత్యం, ఏది నిత్యం, ఏది అనిత్యం, ఎలా ప్రవర్తిస్తే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఆత్మజ్ఞానం పొందటానికి కావలసిన సామాగ్రి ఏమిటి అని వివేకం ఉన్నవాడు తెలుసుకొన్నాక అప్పుడు సాధన ప్రారంభిస్తాడు. సాధన ప్రారంభించాక కూడా వాడికి ఆత్మజ్ఞానం వస్తుందని చెప్పలేము. మీరు ఎంత ధనవంతులు అయినా, పండితులు అయినా భగవంతుని దయలేకుండా మీకు ఆత్మజ్ఞానం

కలుగదు. చాలామంది డబ్బు పెరిగే కొలది అవసరాలు పెంచుకొంటారు. అవసరాలు పెరిగే కొలది మనస్సు పతనమవ్వటం ప్రారంభమవుతుందని వారికి తెలియటం లేదు. శరీరం మరణించాక ఈ డబ్బు కాని, పాండిత్యం కాని మన కూడా రాదు, పాడైపోయిన మనస్సు మన కూడా వస్తుంది. అందుచేత మీకు పరిస్థితులు బాగా ఉన్నా, డబ్బు పెరుగుతూ ఉన్నా అవసరాలు పెంచుకోవద్దు. పైసాలు ఉంటే జాగ్రత్త పెట్టుకోండి అంతేగాని అవసరాలు పెంచుకోవద్దు, అవసరాలు పెంచుకొంటే మనస్సు పాడవుతుంది, మనస్సు పాడైతే జంతులక్షణాలు పెరిగిపోతాయి. మళయాళస్వామివారి ఆశ్రమంలో ఇల్లు కడుతున్నారు. ఇంటికోసం ఒక బండిమీద ఇనుప ఊచలు వేసుకొని వస్తున్నారు. ఆ బండిని లాగటానికి ఎద్దులు చాలా కష్టపడుతున్నాయి. ఆ ఎద్దులు చాలా కష్టపడుతున్నాయి అని మళయాళస్వామి వారితో అంటే పూర్వజన్మలో వారు మనుషులే, వారు భక్తులను పీడించి, హింసించి జంతులక్షణాలను పెంచుకొని ఎద్దులుగా పుట్టారు అని ఆయన చెప్పారు. అవివేకంలో నుండి వివేకంలోనికి రావాలి, వివేకంలో నుండి సాధనలోనికి వస్తాడు. సాధనలోనికి వచ్చాక భగవదనుగ్రహం ఉంటే తరిస్తాడు. సాధన చేసినంతమాత్రం చేత తరిస్తాడు అని చెప్పలేము, దైవానుగ్రహం లేకుండా దైవాన్ని పొందలేడు.

సహజస్థితిని పొందేవరకు నీవు శరీరాలను మోస్తూ ఉండవలసిందే. మోక్షంలో శరీరాలు ఉండవు, మోక్షం వచ్చేవరకు శరీరాలు ఆగవు. భగవాన్ ఏమని చెప్పారు అంటే గాఢనిద్రలో ఉండగా శరీరానికి నీకు ఎట్టి సంబంధం లేదు కాని నిద్రలో నీవు ఉన్నావు. శరీరమే నీవు అయితే నిద్రలో శరీరంతో సంబంధం లేకుండా ఎలా ఉన్నావు? గాఢనిద్రలో నీకు మనస్సు గొడవలేదు, శరీరం గొడవలేదు. ఆ రెండు నీవు అయితే గాఢనిద్రలో మనస్సులో నుండి, శరీరంలో నుండి ఎందుకు విడిపోతున్నావు, ఆ రెండూ నీవు కాదు. జాగ్రదవస్థలో సాధన చేసి ఆ రెండూ పోగొట్టుకొంటే ఈశరీరానికి చావురాకముందే నీకు మోక్షం కలుగుతుంది. చాలామంది మేము కర్మ అనుభవిస్తున్నాము అంటారు. పరిస్థితులు బాగుంటే మంచికర్మ, పరిస్థితులు బాగా లేనప్పుడు చెడ్డకర్మ అంటారు, అదీ కర్మే, ఇదీ కర్మే. మీరు కర్మ అనుభవించకండి అంటున్నారు భగవాన్. దీనికి ఒక సూత్రం చెప్పారు. సర్వసాధారణంగా మనుషులు జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటారు. ఇలా జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటమే కర్మ అని చెప్పారు. అప్పుడు లాభం వచ్చింది, ఇప్పుడు నష్టం వచ్చింది, మేము పుట్టింట్లో సుఖపడ్డాము, ఇప్పుడు అత్తవారింటి దగ్గర కష్టపడుతున్నాము, అప్పుడు పరిస్థితులు బాగున్నాయి, ఇప్పుడు పరిస్థితులు బాగాలేదు అని ఇవి అన్నీ జ్ఞాపకం పెట్టుకొని, వాటినే స్మరిస్తూ కర్మ అనుభవిస్తున్నారు. ఈ గొడవ వదిలేయండి అని చెప్పారు.

మీకు ఒక సాధన లేదు, దేవుడి గొడవ లేదు, ఇంటి దగ్గర ఖాళీగా కూర్చొని, సోమరితనంగా ఉంటూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొని కర్మ అనుభవిస్తున్నారు. దేనికి మీరు కర్మ అనుభవించటం? జరిగిపోయిన గొడవలు మర్చిపోండి, అవి మంచివి ఉండవచ్చు, చెడ్డవి ఉండవచ్చు. జరిగిపోయిన గొడవలు మర్చిపోతే మీ మనస్సుకు లోచూపు కలుగుతుంది, మనస్సుకు శాంతి కలుగుతుంది, మీకు ఆత్మజ్ఞానం తొందరగా వస్తుంది. సాధన చేసినవాడికి బుద్ధిలోని దోషాలు పోతాయి అంటే పాపం పోతుంది.

లోకానికి మూలం డబ్బు. లోకానికి సంబంధించిన గొప్పలు కావాలంటే పైసాలు ఉండాలి. ఒక సామెత ఉంది. డబ్బు ఉన్నవాడికి వీపు మీద కురుపు వేస్తే ఊరంతా తెలుస్తుంది, డబ్బులేనివాడికి కేన్సర్ వచ్చినా తెలియదు. ఇవి అన్నీ కాలక్షేపం కోసం చెప్పటం లేదు. అందులో ఉన్న ప్రమాదం తెలుసుకొని వాటిలోనుండి బయటపడటం కోసం చెపుతున్నాము. సబ్జెక్టు బాగా శ్రవణం చేయాలి. అవసరం లేని గొడవలలోనికి వెళ్ళవద్దు, తిండి దగ్గర జాగ్రత్తగా ఉండాలి. మీ శరీరానికి ఏ వస్తువులు పడవో వాటిని వదిలేయాలి, రాజీపడకూడదు. మీకు అలవాట్లు ఉన్నాయి అనుకో వాటిని తప్పిస్తే అలవాట్లు పోతాయి. ఒకేపని నాలుగుసార్లు చేస్తే అది అలవాటు అంటారు. దానిని చేయటం మానేస్తే అలవాటు లేదు. మనిషి పాడైపోవటానికి అలవాట్లే కారణం. కొంతమంది పైకి బాగుంటారు, లోపల కుళ్ళిపోయి ఉంటారు. దీనికి కారణం లోపల ఏవో అలవాట్లు ఉంటాయి. సారా తాగే అలవాటు ఉన్నవాడిని సారాతాగటం మాన్పించారు అనుకోండి, ఆ కుటుంబానికి అంతటికి సహకారం చేసినట్లు అవుతుంది. సారా తాగేవాడికి పది రూపాయలు ఇవ్వటంకంటే, ఆ అలవాటులో నుండి బయటకు తీసుకొని వస్తే కుటుంబం బాగుపడుతుంది. అయితే దానికి ఎంతో ప్రేమ, శాంతి, జ్ఞానం, శక్తి ఉండాలి. ఇవి అన్నీ లేకుండా ఒక మనిషిని అలవాటులో నుండి బయటకు తీసుకొనిరాలేరు. దేహప్రారబ్ధాన్ని బట్టి ఇవి అన్నీ జరుగుతాయి, ఇవి అన్నీ జ్ఞాపకం పెట్టుకోవద్దు అంటున్నారు భగవాన్. మన శరీరం భూమి మీదకు వచ్చినది మొదలు చనిపోయే వరకు దైవప్రణాళిక ప్రకారం జరిగిపోతుంది, అస్తమాను ఆ గొడవలు అన్నీ మనస్సులోనికి తెచ్చుకొని బాధపడకండి. ప్రారబ్ధం ఎవరు అనుభవిస్తారు? మనస్సు అనుభవిస్తుంది. అది నీవు కాదని తెలిస్తే ఇంక నీకు ప్రారబ్ధం ఏమిటి? నీ జీవితంలో ఏ సంఘటన జరిగినా అది భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు. ఇంక కర్మ, కర్మ అని ఏడుస్తావు ఎందుకు? ఆ ఏడ్చేవాడిని వదిలేయండి. ఉన్నదంతా నీ లోపలే ఉంది, బయట ఏమీ లేదు. బయట మీకు కనిపించేదంతా మీ మనస్సు యొక్క కల్పితమే. మనస్సు నశిస్తే దృశ్యం నశిస్తుంది. దృశ్యం నశించిన వాడికి దుఃఖం లేదు. దృశ్యం కనిపిస్తూ ఉంటే అది నిన్ను బంధిస్తుంది కాని దృశ్యం లేకపోతే ఏమీ

లేదు. ఏదో జరిగిపోయింది, ఏదో జరిగిపోయింది అని ఊహించుకోవటం వలన మీకు అశాంతి వస్తోంది. ఏమీ జరగలేదు, ఏదో జరిగిపోయింది అని మీ మనస్సుకు అనిపిస్తోంది.

నీవు డబ్బుతోటి, గౌరవాలతోటి, దేహంతోటి తాదాత్మ్యం పొందుతున్నావు. ఇలా నీవు కానిదానితో తాదాత్మ్యం పొందుతూ ఉంటే నీవు ఏదిగా ఉన్నావో అది నీకు ఎలా తెలుస్తుంది. ప్రారబ్ధం ప్రకారం దేహం ద్వారా జరిగే సంఘటనలతో తాదాత్మ్యం పొందకండి, అలా మీరు తాదాత్మ్యం పొందకుండా ఉంటే మీలో ఎంత దుఃఖం ఉన్నా శాంతిగా మారిపోతుంది. సద్గురువును అర్థం చేసుకోకుండా మేము ఏదో చేస్తాము అంటే ఏదో చేయటం వలన ఏదో రావచ్చుకాని ఆత్మజ్ఞానం రాదు. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకోవటం, ఇతరుల గొడవలలో కలుగజేసుకోకుండా ఉండటం, ఆహారం విషయంలో, మాటల విషయంలో, తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండటం ఇలా మీ జీవితాన్ని మలచుకొంటారు అనుకోండి లోపల ఉన్న వస్తువు తనంతట తానుగా మీకు వ్యక్తమవుతుంది. మనలో అంతర్యామిగా దైవం ఉన్నాడు. దైవం అంతర్యామిగా లేకుండా ఏదేహం ఈ భూమి మీదకు రాదు. మనోదేహములతో తాదాత్మ్యం వలన లోపల ఉన్న వస్తువు నీకు ఎరుకలోనికి రావటం లేదు, అంటే తప్పడు తాదాత్మ్యం వలన వస్తువు అనుభవంలోనికి రావటం లేదు. మీరు సద్గురువును శ్రద్ధగా శ్రవణం చేయండి, ఇంటి దగ్గర మననం చేసుకోండి, మీకు ఆత్మలబ్ధి కలుగుతుంది. అంటే శ్రవణ, మననాలకు అంత శక్తి ఉంది. నేను మీ దగ్గర మాటలు వింటున్నాను, నాకు ఏమీ తెలియటం లేదు అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటే, తెలియటం లేదు అని ఎవరు అంటున్నారు అని భగవాన్ అడిగారు. నేను అంటున్నాను అన్నాడు. ఆ నేనే నకిలీ నేను, అది భూతంలాంటిది. దాని దగ్గర మనం జాగ్రత్తగా ఉండాలి. నీవు మంచి పనులు చేయటం వలన లోపల ఉన్న నకిలీ నేను పెరుగుతూ ఉంటే ఆ మంచి పనులు అన్నీ దండగే. వాటి వలన నీకు బయట గౌరవం వస్తుంది కాని లోపల కుళ్ళిపోతావు. సాధన అంటే గదిలో తలుపులు వేసుకొని కూర్చోవటం కాదు. శరీరం, మాట, మనస్సు వీటిద్వారా నేను పెరగకుండా చూసుకోవాలి, అదే సాధన. మనం చేతితో చేసే పని, మన మాట, మనకు వచ్చే ఆలోచనలు దేహాభిమానాన్ని పెంచకూడదు. ఈ మూడింటి ద్వారా దేహాభిమానం నశించేలాగ చూసుకోవాలి. మీ ఇష్టాన్నిబట్టి, మీ అలవాట్లను బట్టి జపధ్యానములు చేసుకోండి. కాని త్రికరణాల ద్వారా నేనును తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. మీరు చేసే సత్కర్మ ద్వారా కూడా నేను పోవాలి. మీరు చేసే సత్కర్మ వలన నేను పెరుగుతూ ఉంటే దాని వలన కూడా ప్రయోజనం లేదు.

మన శరీరం ఒక కాలంలో వచ్చింది, ఇంకో కాలంలో పోతుంది. అసలు వస్తువు

మనో దేహములకు, కాలానికి, లోకానికి అతీతం. దానికి ఒక కాలంలో ఉండి, ఇంకో కాలంలో లేకపోవటం అంటూ లేదు. మంచి చెడ్డలు కూడా నిజం కాదు. ఒక మంచివాడు చెడ్డవాడు అవ్వవచ్చు, చెడ్డవాడు మంచివాడు అవ్వవచ్చు. ఇవి అన్నీ అలవాట్లే కదా, ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. మన ఋషులు ఎంత బుద్ధిమంతులు అంటే మా తెలివితేటల వలన ఇవి అన్నీ కనుక్కోలేదు, భగవంతుడు మాకు తెలియపరిస్తే తెలుసుకొని మీకు చెపుతున్నాము అంతే అన్నారు. మనం ఏమి చేస్తాము అంటే ఎవరో వంతెన కడితే మనమే కట్టాము అంటాము, ఎల్లమ్మ మంచిపని చేస్తే ఆ పని మనమే చేసాము అంటాము, మన పరిస్థితి ఇలా ఉంది. మీరు చేసే మంచిపనుల వలన గాని, మీరు మాట్లాడే మంచిమాటల వలన గాని, మీకు వచ్చే మంచి ఆలోచనల వలన గాని దేహగతమైననేను తగ్గాలి. లోపల అజ్ఞానం పెట్టుకొని నీవు ఏవో మంచిపనులు చేసినా దాని వలన పుణ్యం రావచ్చు. పుణ్యం సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది. మీరు సుఖాన్ని పొందారు అనుకోండి మరల ఆ సుఖాన్ని ఎలా పొందుదామని చూస్తారు. మనస్సుకు భోగ ప్రవృత్తి ఉన్నంతకాలం వాడు యోగి అవ్వలేడు.

దేహము నేను అనే తలంపు అది ఒక ముడి. ఆ ముడిని నీ తెలివితేటల వలన విప్పకోలేవు. దానికి ఈశ్వరానుగ్రహం ఉండాలి, గురువు సహాయం ఉండాలి. ఆ ముడివిడిపోయే వరకు మనం ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకూడదు. అందుచేత మనం లోకజ్వరం తగ్గించుకోవాలి. లోకంలో ఉన్న డొల్లతనం, అల్పత్వం మనకు తెలిస్తే మనస్సు అటు ప్రయాణం చేయటం మానివేస్తుంది. ఎక్కడో ఏదో ఉంది అనుకొంటే మనస్సు అక్కడికి పరుగెడుతుంది. లోకంలో కనిపించే అనుబంధాలు కూడా అబద్ధం. అంతా మనోకల్పితం. ఉన్నదంతా నీ హృదయంలోనే ఉంది. కాని బయట ఏదో ఉందని అనుకోవటం వలన నీ మనస్సు చలిస్తోంది. మనస్సు చలించిన తరువాత దానిని నిగ్రహించుకోవటం కంటే అసలు మనస్సుకు చాపల్యం రాకుండా చూసుకోవాలి. మనిషి అవసరం ఉండి చేసే పనులకంటే మనోచాపల్యం వలన ఎక్కువ పనులు చేస్తాడు. మనోచాపల్యం వలన తెచ్చిపెట్టుకొన్న అలవాట్లను అవసరాలు అనుకొంటున్నాము. అవి అవసరాలు కాదు అవి అలవాట్లు, ఇవి మనోచాపల్యం వలన వస్తున్నాయి అని మనకు తెలియటం లేదు. నీకు తెలిసినా, తెలియకపోయినా ఈశ్వరుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆయన అనుభవంలోనికి రాకుండా ఏ వాసనలు, ఏ అలవాట్లు మనకు అడ్డు వస్తున్నాయో తెలుసుకొని, వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. దైవానుగ్రహం వలన లోపల ఉన్న సుఖం, శాంతి నీకు అనుభవంలోనికి వస్తే ఇంక ఈ లోకంతోటి, దేహంతోటి, ప్రకృతితోటి

నీకు పనిలేదు. సుఖస్వరూపం పొందిన వాడికి చావుకి జీవితానికి మధ్య బేధం పోతుంది. ఈ మాటలు అన్నీ అనుభవైకవేద్యం, ఋషులు వారి అనుభవంలో నుండి తీసి చెప్పిన మాటలు. అదృష్టం కొన్ని సంఘటనలు తీసుకొని రావచ్చు, దురదృష్టం కొన్ని సంఘటనలు తీసుకొని రావచ్చు. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవే, వీటితో తాదాత్మ్యం పొందవద్దు. ఇతరుల గొడవ నీకు అనవసరం, నీవు కాని దానితో తాదాత్మ్యం పొందవద్దు. నీ దుఃఖానికి, అశాంతికి నేను అనే తలంపు కారణం. నేను అనే తలంపు నీ లోపల నుండే వస్తోంది. నేను అనే తలంపుకే ఇతర తలంపులు వస్తున్నాయి. నేను అనే తలంపు ఎక్కడ నుండి అయితే పుట్టి వస్తోందో అక్కడే పరమాత్మ ఉన్నాడు. నేను అనే తలంపును పట్టుకొని దానిని ఉపసంహరించి దాని మూలంలోనికి పంపితే, అది నశిస్తుంది. అప్పుడు పరమాత్మ తానుగా వ్యక్తమవుతాడు. దేహం, లోకం, ప్రకృతి, మనస్సు ఇవి అన్నీ జడవస్తువులే. ఈ జడవస్తువులను కదపటానికి ఒక చైతన్యం ఉండాలి. ఆ చైతన్యాన్ని మనం దేవుడు అని పిలుస్తున్నాము. దానికి ఒక రూపం, నామం పెట్టి గుడి కట్టి ఆరాధిస్తున్నాము. ఈ సృష్టినంతా నడిపేది చైతన్యమే. మనం బొమ్మలం ఆడించేది చైతన్యమే, ఇంక నీవు ఎక్కడ ఉన్నావు. ఈ విషయాలను అర్థం చేసుకోవటానికి కొంత సమయం అవసరం. మనకు సహనం లేదు ఇంక ఈ విషయాలు ఎలా తెలుస్తాయి. సహనం లేకుండా హృదయం యొక్క లోతులు పెరగవు. ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా నీకు కనిపిస్తోంది, అదే మాయ. ఉన్నది ఉన్నట్లుగా నీకు ఎరుకలోనికి వచ్చేవరకు లేనిది ఉందని ప్రతిజన్మలోనూ అనుకొంటూనే ఉంటావు. పరమేశ్వరుని అనుగ్రహం వలన, గురువు సహాయం వలన నీ కళ్ళు జ్ఞానంవైపుకు తెరువబడాలి, లేకుండా నీ మొఖం జ్ఞానం వైపుకు తిరుగదు.

అజ్ఞానం అనే చీకటిని తొలగించేవాడే గురువు. జీవుడిలో ఉన్న అజ్ఞానాన్ని భంగం చేసేవరకు ప్రతిజన్మలోను గురువు వాడిని వెంటాడుతూనే ఉంటాడు. మనం నేను, నేనుఅంటాము కదా, ఇది అజ్ఞానంలో నుండి వచ్చిన పిల్లకాయే, మనం దానిని వేసుకొని తిరుగుతున్నాము. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే కంగారుపడుతున్నారు అంటే మీకు ఆత్మవిశ్వాసం లేక అలా కంగారుపడతారు. విజయవాడ నుండి ఒకరు చలంగారి దగ్గరకు అరుణాచలం వచ్చారు. మిమ్మల్ని వారు అలా విమర్శించారు, ఇలా విమర్శించారు అని చలం గారితో వచ్చిన ఆయన చెపుతున్నాడు. కాని చలంగారిలో ఏమీ వికారం కనిపించలేదు, చాలా ప్రశాంతంగా ఉన్నారు. ఆయన వెళ్ళిపోయిన తరువాత చలంగారిని నేను అడిగాను. ఆయన చాలా కబుర్లు చెప్పారు కాని మీలో ఏమీ వికారం కనబడటం లేదు అని అడిగాను. నన్ను విమర్శించిన వారి సంగతి నాకు తెలుసు, వారు అందరూ దొంగలు అని చెప్పారు.

వారు దొంగలు అని తెలిసినప్పుడు నాకు వికారం ఎందుకు? వారు పెద్దమనుషులు అయితే ఎందుకు విమర్శించారని ఆలోచించాలి. వారు దొంగలు అని తెలిసినప్పుడు నాకు వికారం ఎందుకు జిన్నూరు రాజుగారు అన్నారు. మీకు ఆత్మవిశ్వాసం ఉంటే, మీ నిదానంలో మీరు ఉంటే ఎవరు ఏమి అనుకొన్నా మీకు ఏమీ అనిపించదు. మీకు ఆత్మవిశ్వాసం లేదు అనుకోండి వారు ఏమి అనుకొంటున్నారు, వీరు ఏమి అనుకొంటున్నారు అనిపిస్తుంది, అది మీ మనస్సు యొక్క బలహీనతకు గుర్తు. ఎప్పుడూ మీరు ఆత్మవిశ్వాసం పోగొట్టుకోవద్దు. లోకంలో ఉన్న చాలా విమర్శలకు అసూయ కారణం.

లోకాన్ని ఉద్ధరిస్తాము అని చాలామంది చెప్పి చెప్పి చనిపోయారు కాని లోకం మాత్రం అలాగే ఉంది. నువ్వు ఎవడవురా లోకాన్ని ఉద్ధరించటానికి. నువ్వు పుట్టకముందు ఈ లోకం ఉంది, నువ్వు చనిపోయాక కూడా ఈ లోకం ఉంటుంది. ఈ లోకానికి ఎవడు ప్రాణం పోసాడో వాడే ఈ లోకం గొడవ చూసుకొంటాడు. నీ మాట, నీ ఇంద్రియాలు, నీ మనస్సు నీ స్వాధీనంలో లేవు. నువ్వు లోకాన్ని ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి? నీకు తినటానికే తిండిలేనప్పుడు అన్నసత్రం పెడతానంటావు ఏమిటి? ఇవి అన్నీ కపటంతో కూడిన మాటలు, లోకాన్ని మోసం చేసే మాటలు. నిన్ను నీవు బాగుచేసుకోవటం మానేసి ఈ లోకం గొడవ ఎందుకు? ఇక్కడే మీరు అర్థం చేసుకోండి. ఒకవేళ మీరు లోకంలో మంచిపనులు చేసినా గొప్పలకోసం చేయకండి, మీరు బాగుపడటం కోసం చేయండి లేకుంటే వద్దు. మనలో ఉన్న వాసనలను, బలహీనతలను తొలగించుకోవటానికి మనం ఈ భూమి మీదకు వచ్చాము. ముందు నీవు వచ్చిన పని చూసుకో. మనస్సును బాగుచేసుకోవటానికే ఈ సమావేశాల ప్రయోజనం. బాగుపడిన మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. మనస్సు ఒకోసారి హృదయం వైపుకు వెళుతుంది, ఒకోసారి బయటకుపోతుంది. హృదయం వైపుకు మనస్సు వెళ్ళినప్పుడు అది శాంతిని ఇస్తుంది, బయటకు వెళ్ళినప్పుడు అశాంతిని పోగుచేస్తుంది. మనస్సు అంతర్ముఖం అవుతోంది అనుకో నేను చెప్పే మాటలను మనస్సు పట్టుకొంటుంది, ఆ మాటల విలువ, అర్థం దానికి తెలుస్తాయి. మనస్సు బాహ్యాముఖమవుతూ ఉంటే నేను కోటిసార్లు చెప్పినా ఆ మాటలు అర్థంకావు, ఆ మాటలను అది పట్టుకోదు. ఆ మాటలు చెప్పేటప్పుడు నీ మనస్సు లోచూపు కలిగి ఉంటే సడన్‌గా పట్టుకొంటుంది, ఆ మాటలు మీ జీవితాన్ని మార్చేస్తాయి. బాహ్యాముఖంగా ప్రయాణం చేసే మనస్సుకు గురువు యొక్క మాట విలువ తెలియదు, సాక్షాత్తు ఈశ్వరుడు ప్రక్కన కూర్చొన్నా ఆయనను అర్థం చేసుకోలేదు, పట్టుకోలేదు. మనస్సు పల్చబడుతూ ఉంటే దాని మూలం వైపుకు జరుగుతూ ఉంటుంది. అలా జరిగి జరిగి మనస్సు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, నీవు ఏదిగా

ఉన్నావో దాని తాలూక ఎరుక నీకు కలుగుతుంది, అది నీ కడసారి జన్మ. మాటలలో ఏముంది, గురువు యొక్క అనుగ్రహంలో, ఆయన దయలో అంతా ఉంది. నది వెళ్ళి సముద్రంలో ఎలా ఐక్యం అవుతుందో అలాగ నీ మనస్సు వెళ్ళి హృదయంలో ఐక్యం అవ్వాలి, అదే నీ జీవిత గమ్యం. పూర్వజన్మలు, రాబోయే జన్మలు ఆ గొడవలోనికి వెళ్ళవద్దు. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన గొడవలు, మనస్సు నీవు కాదు. నీవు ఏదిగా ఉన్నావో దానికి చావులేదు, దానికి పుట్టుకలేదు. మీరు ఆ గొడవలలో ఉండండి. మీ దృష్టి, మీ శక్తి అంతా అక్కడ కేంద్రీకరించండి. మీరు చిల్లరగొడవలలోనికి వెళ్ళవద్దు. వాటిలోనికి వెళితే మీ పతనం ప్రారంభమవుతుంది. ఒకవేళ మీకు జన్మ వచ్చినా, రోజులు బాగా వెళ్ళిపోతున్నా, మీకు సన్మానాలు ఊరేగింపులు చేస్తున్నా మీరు వేయి సంవత్సరాలు బతుకుతారా? ఈలోకం లోనికి వచ్చినందుకు ఎంతోకొంత బాగుపడకపోతే నీవు జీవించిన జీవితం అంతా వృధా.

ఇద్దరు భక్తులు కూర్చొని ఉంటారు, నారదుడు అక్కడకు వస్తాడు. నీవు ఎక్కడనుండి వస్తున్నావు అని వారు అడుగుతారు. వైకుంఠం నుండి అని నారదుడు చెప్పాడు. అక్కడ నారాయణుడు ఏమి చేస్తున్నాడు అని అడిగారు. ఒంటెలను, ఏనుగులను సూదిబెజ్జంలో నుండి లాగుతున్నాడు అని చెపుతాడు. ఒక భక్తుడు ప్రశాంతంగా ఆ మాటలు విని సంతోషించాడు. వాడి ఉద్దేశ్యం ఏమిటి అంటే దేవుడికి ఏదైనా సాధ్యమే. ఇంకో భక్తుడు ఏమన్నాడు అంటే దేవుడు అయినా ఒంటెలను సూదిబెజ్జంలో నుండి ఎలా లాగుతాడు అన్నాడు. అప్పుడు నారదుడు ఏమి చెప్పాడు అంటే ఇద్దరూ భక్తులేకాని వాడికి విశ్వాసం ఉంది, నీకు విశ్వాసం లేదు కాబట్టి ఇటువంటి ప్రశ్నలు వస్తున్నాయి అన్నాడు. వాడిలా నీవు కూడా విశ్వాసం పెంచుకో, బాగుపడతావు అని చెప్పటానికే వచ్చాను అన్నాడు నారదుడు. మీరు ఎవరికైనా పది రూపాయలు ఇచ్చారు అనుకోండి. నేను ఇచ్చాను అని మీరు అనుకొంటున్నారు కదా. మీకు ఎవరు ఇచ్చారు. ఆ డబ్బు భగవంతుడికి తెలియకుండా వచ్చిందా? ఇక్కడ ఒకటి మీరు అర్థం చేసుకోవాలి. భగవంతుడు మనకు ఇచ్చినదే మనం భగవంతుడికి ఇస్తున్నాము అని మనకు తెలిస్తే మనస్సు అణిగిపోతుంది. ద్వితీయం అంటూ ఏమీ లేదు. భగవంతుడి లీల ఎలా ఉంటుంది అంటే ఇప్పుడు మామిడి పండ్ల రోజులు కదా. చెట్టును పిందె తయారవుతున్నప్పుడే అది ఎవరి నోటికి వెళ్ళాలో రాసిపెట్టి ఉంచుతాడు. నేను చెప్పిన మాటలు నూటికి నూరుపాళ్ళు అబద్ధం అని మీకు అనిపిస్తుంది. మామిడిపండు బజారుకు వెళ్ళి, అక్కడ ఎవడో కొనుక్కొంటే అలా చేతులు మారుతూ దానికి ఎవడు ఓనరో వాడి నోటి దగ్గరకు వెళ్ళేవరకూ అలా జారిపోతూ ఉంటుంది, అది భగవంతుడి యొక్క లీల. ఈశ్వరప్రణాళిక ప్రకారం అది ఎవడి నోటిలోనికి వెళ్ళాలో అక్కడికి చేరేవరకు ఆగదు, అది

కూడా మనచేతిలో లేదు. కొంతమంది తిండి కూడా తినకుండా సంపాదిస్తారు, తరువాత ఎవడో వచ్చి దానిని అనుభవిస్తాడు. వారు తిందామన్నా తినలేరు ఎందుచేతనంటే దానికి వాడు ఓనరు కాదు. మీ మనస్సు హృదయం వైపుకు వెళ్ళేటట్లు చూసుకోండి. మీ మనస్సును ఎక్కువ కాలం హృదయంలో నిలబెట్టి ఉంచితే మీకు తెలియకుండానే మీ అలవాట్లు, మీ మనస్సులో ఉన్న బలహీనతలు రాలిపోతాయి, మీరు పవిత్రులవుతారు. మీకు సుఖం అందుతుంది. ఇంత సుఖం, శాంతి నా జీవితంలో అనుభవించ గలుగుతున్నానా అని మిమ్మల్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు. పరిసరాల పట్ల, వ్యక్తుల పట్ల మీ దృక్పథం మారిపోతూ ఉంటుంది. పూర్వం మీ అత్తగారు మిమ్మల్ని ఏమైనా అన్నారు అనుకోండి, వాటిని జ్ఞాపకం పెట్టుకోవద్దు. మీ అత్తగారు ఇలా అన్నారు అని మీకు జ్ఞాపకం వస్తూ ఉంటే, ఆవిడ మీద ప్రతీకారం తీర్చుకోవాలనిపిస్తుంది. ప్రతీకారం తీర్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే కర్మ చుట్టుకొంటుంది. ఆ విషయం మర్చిపోతే ఏమీ లేదు, కర్మ అనుభవించనక్కరలేదు అంటున్నారు భగవాన్. గతం మర్చిపోండి అని భగవాన్ చెపుతూ ఉంటే మరి ఇప్పుడు 20 సం॥లు బతుకుతాను అనుకోండి ఏదో కర్మ చేస్తాను కదా, మరి ఈ కర్మ మాట ఏమిటి అని అడుగుతున్నాడు. ఆ కర్మ ఎలా పోతుందో ఈ కర్మ కూడా అలాగే పోతుంది. రేపుకు ఈ రోజు నిన్న అవుతుంది. అలానే భూతకాలం మర్చిపోయేకొలది భవిష్యత్‌కాలం భూతకాలం అవుతుంది. ఆ కర్మ పోయినట్లే ఈ కర్మపోతుంది అప్పుడు నీవు మిగులుతావు. అప్పుడు ఉన్నదే శాంతి, ఉన్నదే ఆనందం.

ఆ పని చేయండి మీకు పుణ్యం వస్తుంది, ఈ పని చేయండి మీరు స్వర్గానికి వెళతారు అని ఇటువంటి మాటలు చెపుతూ ఉంటే వినేవాడికి ఇష్టంగా ఉంటుంది కాబట్టి చెప్పేవాడు చెపుతాడు. మీరు ఎలా చెపితే సంతోషిస్తారో అలా చెపుతున్నారు కాని మిమ్మల్ని ఎక్కడకు తీసుకొని వెళ్ళాలో వారికి తెలియదు, మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో ఒక్క గురువుకే తెలుసు. మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళితే ఆనందం మీకు అందుతుందో అది తెలుసుకోకుండా మిమ్మల్ని ఉబ్బించే మాటలు, మిమ్మల్ని నరకానికి తీసుకొని వెళ్ళే మాటలు ఎందుకు? తాత్కాలికంగా సంతోషం కలిగించే మాటలు మేము చెప్పకూడదు, అలా చెపితే మీరు దారి తప్పిపోతారు. మీకు ఉన్న సంస్కారాలు, వాసనలు పూర్తిగా వేరుతో సహానశిస్తేనే మీకు శాంతిస్థిరపడుతుంది. లోపల వాసనాక్షయం అవ్వకుండా మధ్యలో శాంతి కలిగినా నిలబడదు. మీరు అందరు ఆత్మజ్ఞానానికి వారసులే. ఎప్పుడో చనిపోయిన తరువాత కాదు, ఈ జన్మలోనే ఇప్పుడే ఇక్కడే శాంతిని పొందుతారు. ఇంతతొందరగా నేను సుఖాన్ని, శాంతిని అనుభవిస్తానని నేను అనుకోలేదు అని మీరు అనుకొనేరోజు వస్తుంది. ఎప్పుడో

వస్తుందనుకొన్నది అప్పడే వచ్చేసింది ఏమిటి? ఎక్కడో వస్తుందనుకొన్నది ఇక్కడే వచ్చేసింది ఏమిటి? అని మీకు అనిపిస్తుంది. అలా అనిపించటమే కాదు మిమ్మల్ని చూసి మీరు ఆశ్చర్యపోతారు. మీరు ఎంత తెలివైన వారు అయినా, ఎంత చదువుకొన్నా మీ మనస్సుకు లోచూపు కలిగినప్పడే నేను చెప్పేమాట బరువు మీకు తెలుస్తుంది, బాహ్యముఖమవుతున్న మనస్సుకు ఆ మాట యొక్క బరువు తెలియదు. ఆత్మజ్ఞానం యొక్క వైభవం గురించి శ్రవణం చేసి ఉంటే దానిని పొందాలనే బుద్ధి కలుగుతుంది. కనీసం శ్రవణం లేకపోతే పొందాలనే బుద్ధి ఎలా కలుగుతుంది. శ్రవణం చేయటం వలన నీవు ఏది పోగొట్టుకోవాలో తెలుస్తుంది. మననం చేయటం వలన పోగొట్టుకోవలసింది పోగొట్టుకొంటారు. శ్రవణం చేయటం వలన మీరు ఏదైతే కాదో మీకు తెలుస్తుంది, మననం వలన కాని దానిలోనుండి విడిపోతారు. శ్రవణం, మననం వలన మీరు పొందవలసింది ఏదో పొందుతారు, మీకు ఆత్మలాభం కలుగుతుంది. ఎవరో చేస్తున్నారని మనం కాని పనులు చేయటానికి మనం సిద్ధమవ్వకూడదు. నో అని చెప్పేచోట నో అని చెప్పాలి. ఎవరో ఏదో చేసారని మీరు చేయవద్దు. మనకు నచ్చిన పని చేసి ఊరుకోవాలి. ఎవరో చేసారని మనం చేస్తే మనకు శాంతి రాదు, అశాంతి మిగులుతుంది. అనుకరణ వద్దు. అనుకరణ భయానికి గుర్తు. పూర్వజన్మల గొడవ, రాబోయే జన్మల గొడవ వద్దు, అవి నిజం కాదు. మీ హృదయంలో ఒక సత్యం ఉంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి సర్వవిధముల ప్రయత్నం చేయండి. అది మాత్రమే మిమ్మల్ని ప్రకృతిలో నుండి విడిపించగలదు. అది మాత్రమే మీకు మోక్షసుఖాన్ని ప్రసాదించగలదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-04-07, చిలుకూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జ్ఞానం ఎప్పడూ ఉంది. మన మనస్సు నిర్మలం అయితే, నిశ్చలం అయితే, పవిత్రమైతే అది జ్ఞానంలో ఐక్యమవుతుంది. సూర్యుడిని, సూర్యరశ్మిని వేరుచేయలేరు అలాగే ఆత్మజ్ఞానాన్ని, మోక్షాన్ని వేరుచేయలేరు. ఒక్క ఆత్మజ్ఞానానికే మోక్షం సాధ్యం. మధ్యలో వచ్చినవి మధ్యలోనే పోతాయి. ఎప్పడూ ఉండేదే ఉంటుంది, అదే చైతన్యం, అదే ఆత్మ. శరీరాలు, గౌరవాలు, పదవులు, సంపదలు మధ్యలో వచ్చినవి మధ్యలోనే పోతాయి. ఇలా మధ్యలో వచ్చిన వాటిని చూసుకొని విర్రవీగకూడదు, అవి నిలబడవు. ప్రతీ మనిషికి సుఖం, శాంతి కావాలి. మన ప్రాణం, మనస్సు హృదయంలో ఐక్యమైతే మనం కోరుకోవటానికి ఏమి మిగలదు. చైతన్యంలో నుండి మనస్సు వచ్చింది, మనస్సులో నుండి ప్రాణం వచ్చింది. ప్రాణం మనస్సులో అణిగిపోతే, మనస్సు హృదయంలో అణిగిపోతే ఇంక పునర్జన్మ లేదు. ప్రాణం, మనస్సు హృదయంలో

ఎంత కాలం అయితే అణగవో అంతకాలం పునర్జన్మలు వచ్చి తీరతాయి. మధ్వాచార్యుల వారు మోక్షంకంటే సత్ప్రవర్తన, సద్బుద్ధి, సదాచారం, సహృదయాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు, మీరు అలాగ జీవించండి వచ్చేది వస్తుంది అని చెప్పారు. బయట శత్రువులను జయించటం తేలిక, లోపల శత్రువులను జయించటం చాలా కష్టం. ఒకరకమైన ఉద్రేకాలు, కోరికలు ఎన్నో జన్మల నుండి మన కూడా వస్తాయి, అవి మన మనస్సును బలహీనపరుస్తాయి అందుచేత మీరు భగవంతుని పాదాలను విడిచిపెట్టవద్దు, ఆ బలహీనతల నుండి బయటకు వస్తారు అని మధ్వాచార్యులవారు చెప్పారు. లోకంలో అందరూ చేసే తప్పు ఏమిటి అంటే సుఖం ఎక్కడో బయట ఉంది అనుకొంటున్నారు, ఏదో వస్తువును సంపాదించినట్లుగా దానిని సంపాదించాలి అనుకొంటున్నారు. బయట ఉంటే సంపాదించవచ్చు కాని అది బయట లేదు. మన స్వరూపమే సుఖం, మన స్వరూపమే శాంతి. స్వరూపజ్ఞానం కలవాడు అమృతుడు అవుతాడు. ఎప్పుడైతే మనస్సు పరిశుద్ధం అయ్యిందో, బుద్ధి పక్వానికి వచ్చిందో అప్పుడు లోపల ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. లోపల పక్వత లేనప్పుడు వేదాంతం మాట్లాడకూడదు. దాని వలన మనకు లాభం లేదు సరికదా తిరిగి నష్టం వస్తుంది.

నిన్ను నీవు తెలుసుకో అని భగవాన్ ఎందుకు చెప్పారు అంటే నిన్ను నీవు తెలుసుకొంటే నీ స్వరూపంలో ఉన్న సుఖం, శాంతి నీచేతికి అందుతాయి. నిన్ను నీవు తెలుసుకోకుండా ప్రపంచంలో ఉన్న విషయాలు తెలుసుకొంటూ ఉంటే నీకు సుఖం రాదు. మనస్సులో ఏ కోరిక లేకుండా నూటికి నూరు పాళ్ళు భగవంతునివైపుకు ప్రయాణిస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది కాని లేకుంటే కలుగదు. కొంత మనస్సు గౌరవాల మీద, కొంత మనస్సు పదవుల మీద ఉంటూ ఇలా రోడ్డు మీద ఉన్న దుమ్ము పోగుచేసుకొంటూ మనస్సు ముక్కలు అయిపోతే జ్ఞానాన్ని పొందలేము, పైగా మనస్సు బలహీన పడుతుంది, వారు సొంతంగా ఆలోచించుకోలేరు. మాకు శాంతి లేదండి అని చాలామంది అంటూ ఉంటారు. శాంతి ఎవడబ్బ సొమ్ము, అది మీ తండ్రిగారు, తాతగారు ఇచ్చేదా, లేకుంటే వారసత్వంగా వచ్చేదా? అలా రాదు. ఎవడికైతే లోకానికి సంబంధించిన కోరిక లేదో, ఎవడికైతే కర్మఫలం పట్ల ఆసక్తి లేదో, ఎవడికైతే అహంత, మమత లేదో వాడు మాత్రమే శాంతికి వారసుడు అంటున్నాడు పరమాత్మ. మీరు బాగా మాట్లాడారని వినేవారు చెప్పకోవాలని మాట్లాడితే అటువంటి మీటింగులకు అసలు వెళ్ళకూడదు. శబ్దానికి అర్థం చెప్పేవాడు పండితుడు కాదు, ఆత్మ జ్ఞానం కలిగినవాడు పండితుడు. సత్యాన్వేషకుడు లోపలకు దిగటం నేర్చుకోవాలి. రకరకాల మనుషులు ఉన్నారు కాబట్టి ఇది లోకం అయింది, వారిని ప్రమాణంగా పెట్టుకోవద్దు. నీవు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో, భగవంతుని మాటను ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తే నీవు

భగవంతుడిలో ఐక్యమవుతావు లేకపోతే అవకాశం లేదు. దేహమునందు ఆత్మబుద్ధి పెట్టుకొని నేను జ్ఞానిని అనుకొంటే వాడినివాడు మోసం చేసుకోవటం, ఇతరులను మోసం చేయటం. అందరిలోను అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు మనం ఎవరిని ప్రేమిస్తాము, ఎవరిని ద్వేషిస్తాము. అంతా నారాయణ స్వరూపమే. మనం ఎవరిమీద అనురాగం పెట్టుకొన్నా, ఎవరిమీద ద్వేషం పెట్టుకొన్నా మనస్సు బాహ్యాముఖం అవ్వకుండా ఆపుచేయలేము.

మేము మౌనంగా ఉన్నాము అంటారు, నోటికి మూత పెట్టారు మంచిదే, మనస్సు మూయబడిందా? ఇతరులకు అబద్ధం చెప్పినా మీ మనస్సు మూయబడిందో లేదో మీకు తెలియటం లేదా. మనస్సుకు మౌనం రాకుండా ఆత్మజ్ఞానం కలుగదు. నీ మనస్సు పవిత్రం అవ్వకుండా ఆత్మజ్ఞానాన్ని ఎలా ఆశిస్తున్నావు? ఒకవేళ నీవు ఆశించినా అది లభ్యపడుతుందా? నీవు ఈశ్వరుడిని మోసం చేయగలవా? ఆయన సర్వసాక్షి, సర్వశక్తిమంతుడు. పని విడిచిపెట్టిన వాడికి జ్ఞానంరాదు. ఫలం పట్ల ఆసక్తి లేకుండా ఉండాలి. అహంత, మమత నీ అశాంతికి కారణం. ఇవి రెండూ లేకుండా పనిచేస్తే నీకు మానసిక అశాంతి లేకుండా పని పూర్తి అవుతుంది, నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే గేటు ద్వారా నీవు మోక్షంలో ప్రవేశించవచ్చు. లోకాన్ని శోధించినవాడికి మోక్షం రాదు, చిత్తాన్ని శోధించినవాడికి మోక్షం వస్తుంది. నీకు ఉన్న బలహీనతలలో నుండి, ఉద్రేకాలలో నుండి బయటకు రాకుండా శాంతిని ఎలా పొందుతావు. కొంతమంది జీవితాలను ప్రారబ్ధం ఎన్నో దెబ్బలు కొడుతుంది. ఆ దెబ్బలను చిరాకుగా కాకుండా ఇష్టంగా సహించ గలిగితే వారికి జ్ఞానం కలుగుతుంది. ఈశ్వరుడికి, గురువుకి దయ ఉంటుంది కాని ప్రారబ్ధానికి దయ ఉండదు. రోడ్డురోలరు కింద మన తలకాయపెడితే ఎలా నలిపేస్తుందో అలాగ ప్రారబ్ధం మనలను నలిపేస్తూ ఉంటుంది, ప్రారబ్ధానికి దయ ఎలా ఉంటుందో తెలియదు. భగవంతుడిని స్మరించటం వలన మనం పవిత్రులం అవుతాము, మోక్షాన్ని పొందటానికి అర్హత కలుగుతుంది.

ఎవడైతే తన్ను తాను పోగొట్టుకొంటాడో వాడు స్వర్గరాజ్యానికి అర్హుడు అన్నాడు యేసు. మనం నేను, నేను అంటున్నాము కదా ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నాడు రామకృష్ణ పరమహంస. నీవు కాని నేనును నీవు అనుకోవటం వలన ఎంత క్షోభ, ఎంత అశాంతి, ఎన్ని శవాలను మోస్తున్నావు. పాముని తాడు అనుకొని తిరగవద్దు, శోధించకుండా స్నేహాలు చేయవద్దు. సత్పురుషులు దొరకకపోతే సద్గ్రంథాలు చదవండి. నాగమ్మగారికి తల్లి, తండ్రి ప్రేమ ఎలాఉంటుందో తెలియకుండా తల్లి, తండ్రి చనిపోయారు. భర్త సుఖం తెలియకుండా భర్త చనిపోయాడు. సద్గ్రంథాలు చదువుతున్నా లోపల అశాంతి పోవటం లేదు. ఒక గురువు కలలో వచ్చి మౌనంగా ఆవిడను ఆశీర్వదించాడు. తరువాత అన్నగారు

ఆవిడను రమణాశ్రమం పంపారు. మొదటసారి ఆవిడ భగవాన్ దగ్గరకు వెళ్ళేటప్పటికి ఆయన కళ్ళు మూసుకొని కూర్చొన్నారు. కళ్ళు తెరిచిన వెంటనే ఆవిడ వంక చూసారు, ఆవిడ ఆయనతో ఏమీ చెప్పలేదు, ఆవిడ జీవితం అంతా పుస్తకం చదివినట్లు చదివారు. నాకు రక్షకుడు దొరికాడు అని ఆవిడ అనుకొంది. రమణాశ్రమం లేఖలు ఆవిడ వ్రాయాలని వ్రాయలేదు. పది వాక్యాలు వ్రాసి భగవాన్ దగ్గరకు తీసుకొనివెళ్ళారు, బాగా వ్రాసారు అన్నారు భగవాన్. ఆవిడకు ఎంకరేజ్‌మెంట్ వచ్చింది. అన్నగారియందు కృతజ్ఞతాభావంతో భగవాన్ చెప్పిన మాటలు అన్నగారికి ఉత్తరాలు వ్రాద్దాము అని మొదలుపెట్టారు. కేన్సర్ భగవాన్ శరీరాన్ని పీడించింది ఒక గంటలో భగవాన్ శరీరం విడిచిపెడతారు అనగా ఆమె క్యూలో భగవాన్‌ను చూడటానికి వెళ్ళారు. అంతకుముందు ఈ కేన్సర్ తగ్గిపోతే బాగుండును ఈ శరీరం కొంతకాలం ఉంటే బాగుండును అని నాగమ్మగారు అనుకొనేవారు. ఈ రోగం శరీరాన్ని పీడించేస్తోంది శరీరం పోతే బాగుండును అనుకొంది. గురువు చనిపోడు, చనిపోయేవాడు గురువుకాదు, దేహానికి భగవాన్‌కు సంబంధం లేదు. గురువు అంటే ఆత్మ. నీవు తత్వాన్ని గ్రహించావు అమ్మా అని భగవాన్ దయతో ఆవిడ వంక చూసారు. గురువు యొక్క జ్ఞానం, శక్తి ఏ జీవుడికి ఎలా పనిచేస్తుందో చెప్పలేము. భగవాన్ లేరని తలంపు రాలేదు, ఇక్కడే ఉన్నారు అనిపించింది, మాటలతో పనిలేకుండా నాగమ్మగారి అశాంతి అంతా మౌనంగానే పీల్చుకొన్నారు. ఆవిడ దేహప్రారబ్ధం అనుభవించింది, అశాంతి మాత్రం శేషం లేకుండా తుడిచేసారు. అది గురువు యొక్క అనుగ్రహం, అది గురువు యొక్క వైభవం. భగవాన్ సన్నిధిలోనికి వచ్చాక అశాంతి అంతా ఆయన పీల్చుకొన్నారు, ఇంక మిగిలింది శాంతే. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి. ఆహారం సాత్వికంగా ఉండాలి. తొందరగా జీర్ణం అయ్యే పదార్థాలు తీసుకోండి. మీరు తీసుకొనే ఆహారం శుద్ధిగా ఉండాలి. ఆహారం శుద్ధిగా ఉంటే మీ మనస్సు బాగుపడుతుంది, బుద్ధి బాగుపడుతుంది. వివేకం, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. కొంతమంది అవసరం లేని మాటలు మాట్లాడతారు. అన్నీ వాళ్ళకు తెలుసునని మనకు తెలియాలి అనుకొంటారు అదొకరకమైన అహంకారం. సహృదయంతో, సద్బుద్ధితో మాట్లాడితే ఒక్కమాట చాలు ఇతరులకు మారుమనస్సు వస్తుంది. వారిమీద నీకు ప్రేమ, ఆప్యాయత ఉండాలి. ప్రేమలేని మాటలు కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి.

ఏమీ తెలియనివాడు ఎగిరి ఎగిరిపడతాడు, అన్నీ తెలిసినవాడు అణిగి ఉంటాడు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ద్వేషించటానికి, ప్రేమించటానికి ఎవరు ఉన్నారు. మన బుద్ధి మంచిది కాకపోతే ఈ మాటలు విన్నా అది గ్రహించలేదు. ఊరంతా బంగారం, ఇల్లు అంతా బంగారం అయినా నీ బుద్ధి పాడైనతరువాత

ఆ బంగారం ఏమి చేసుకొంటావు. మీ ఇంట్లో ఉన్న బంగారం బట్టి మీరు సుఖపడరు. మీ మనస్సు బంగారం అయితే మీరు సుఖపడతారు. మోక్షం పొందాలనే కాంక్ష ఎంతోకొంత మీకు ఉంది లేకుంటే ఇంతదూరం రారుకదా, అది ఆరిపోకుండా కాపాడుకోవాలి. మానవ జన్మలో మనం ఎంతోకొంత వికాశం పొందాలి. నువ్వు ఉంటే ప్రపంచం ఉంది, వీడు ఉన్నాడు, వాడు ఉన్నాడు, నువ్వు ఉంటే అన్నీ ఉన్నాయి. నువ్వు లేకపోతే ఏదీ లేదు. ఆ నువ్వు ఎవరు? ఆ విచారణ వదిలేసి ఎన్ని లోకాలు, ఎన్ని దేశాలు తిరుగుతావు. ఆ నేను ఎవరో తెలుసుకుంటే ఈశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు. సబ్జక్టు, ఆలోచన ఇవి రెండూ విడిచిపెట్టకండి. నీ మనోదేహములతో సంబంధం లేకుండా సత్యం నీ హృదయంలో ఉంది, అది స్వతంత్రంగా ఉంది, మనవి అన్నీ బానిస బ్రతుకులు. రవ్వంత కూడా విచారణ చేయకుండా ఎవరి మీదో మమకారం పెట్టుకొని వాళ్లకి చాకిరీ చేసి చేసి చివరకు చనిపోతారు. మమకారం పెట్టుకోకూడదు, ఎవరి గురించి అయినా పనిచేస్తే చేయండి, మీ గురించి మీరు విచారణ చేసుకోండి. సన్యసించటం అంటే బట్టలు మార్చుకోవటం కాదు, ఇంట్లో మనుషులను ప్రపంచాన్ని వదిలిపారిపోవటం కాదు, మమకారం లేకుండా పని చేయటం. అప్పుడు పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు.

ఒకోసారి మీ మనస్సుకు ఇష్టమైన సంఘటనలు జరుగుతాయి, ఒకోసారి ఇష్టంలేని సంఘటనలు జరుగుతాయి. ఎందుకు అలా కంగారుపడుతున్నారు, ఎందుకు భయపడుతున్నారు, ఎందుకు మీ నిద్రను పాడుచేసుకొంటున్నారు. నీకు ఇష్టమైన సంఘటనలు జరిగినా, ఇష్టంలేని సంఘటనలు జరిగినా అవి భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు. అది మీకు తెలిస్తే భయం పోతుంది. శవాలను కాల్చగా వచ్చిన బూడిదను, ఎముకలను గంగానదిలో కలుపుతారు. ఆ బూడిదను, ఎముకలను భరిస్తూ గంగానది శాంతంగా తన మార్గాన తాను ప్రవహిస్తూ ఉంటుంది. నిజమైనగురువు గంగానది లాంటివాడు. బూడిదను, ఎముకలను గంగానది భరిస్తోంది, ఈ జీవకోటిని గురువు భరిస్తున్నాడు. గురువు మీద అత్తరుపోసిన, పేడ నీళ్ళు పోసిన తనపని తాను చేసుకొంటూ వెళ్ళిపోతాడు. మమకారం లేకుండా పని చేయటం నేర్చుకో. ఆత్మకానిదాని మీద ఆత్మబుద్ధి పెట్టుకొంటున్నావు. అది విడిచిపెట్టటమే నిజమైన సన్యాసం. ప్రారబ్ధాన్ని బట్టి మీ ఇంటిలో కొన్ని బొమ్మలు పెడతాడు. ఆ బొమ్మలకోసం మీ డ్యూటీ మీరు చేయండి. అంతేగాని ఆ బొమ్మలను వేసుకొని తిరుగుతూ మీరు ఎవరో మీరు తెలుసుకోవటం మానవద్దు, విచారణ విడిచిపెట్టవద్దు. కళ్ళు మూస్తే వారికి మీకు ఏమీ సంబంధం లేదు. ఎవడికోసం అయితే నీవు జీవితం పొడుగునా కష్టపడుతున్నావో నీవు చనిపోయిన తరువాత వాడు వల్లకాటికి

రావటానికి కూడా బద్ధకించవచ్చు. వీరికోసమా నీవు విచారణ విడిచిపెట్టుకోవటం. వారికి నీకు ఏమిటి సంబంధం? భగవంతుడితోటి, గురువుతోటి విరోధం పెట్టుకొని మీరు ఏమీ చేయలేరు, భగవంతుని సంకల్పంతో రాజీపడటం నేర్చుకో. భగవంతుడి సంకల్పం కాదని నీవు చేసేది ఏమీ లేదు. నీకు ఇష్టమైనవి జరిగినా, ఇష్టంలేనివి జరిగినా అవి భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు. అట్టి భగవంతుడు అంతటా ఉన్నాడు, నీ హృదయంలోను ఉన్నాడు. నీవు ఎలా రాజీ పడతావో ఆయనతో రాజీపడటం నేర్చుకో. ఆయనతో రాజీపడనంటావు అనుకో నీకు మిగిలేది క్షోభ, మిగిలేది నరకం, మిగిలేది అశాంతి, మిగిలేది పాడు లోకాలు. ఈశ్వరసంకల్పాన్ని నీ సంకల్పంగా మార్చుకో, ఈశ్వరుడి ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకో అప్పుడు నీకు అశాంతి నశిస్తుంది.

భగవంతుడి ప్రేమ ఒక కులానికో, ఒక మతానికో, ఒక ప్రాంతానికో పరిమితమైనది కాదు. అది విశ్వవ్యాప్తమైనది. నీవు ఈశ్వరుడితో రాజీపడినప్పుడు నీ ప్రేమ కూడా విశ్వవ్యాప్త మవుతుంది, నేను ఉన్నాను అని అనుకొంటున్నావు కదా ఆ ప్రేమలో ఈ నేను కరిగిపోతుంది. మిమ్మల్ని మీరు మర్చిపోయి మీ జీవితంలో ఎప్పుడైనా ఒక చిన్న మంచి పని చేసారా? లోకవాసన, దేహవాసన పెట్టుకొని మంచిపనులు చేస్తున్నారా? ఇవి అన్నీ మీరు జాగ్రత్తగా చూసుకోండి. భగవంతుడు కళ్ళు లేకుండా చూడగలడు, కాళ్ళు లేకుండా నడవగలడు, చేతులు లేకుండా పనిచేయగలడు అది మర్చిపోవద్దు. మీరు భగవంతుడి సంకల్పంతో రాజీపడితే ఏ సంకెళ్ళలో నుండి మీరు బయటపడాలని అనుకొంటున్నారో, ఏ బంధాలను ఛేధించాలని అనుకొంటున్నారో, ఏ మాయలో నుండి విడుదల అవ్వాలి అనుకొంటున్నారో మీకు తెలియకుండానే వాటిలో నుండి బయటపడతారు. ఆపరేషన్ జరుగుతోంది అని మీకు తెలియదు, అనారోగ్యంలో నుండి, బాధలోనుండి బయటకు వచ్చేస్తారు. జ్ఞాని చెప్పేమాట ఒక ప్రాంతానికి, ఒక దేశానికి పరిమితం కాదు, అది విశ్వవ్యాప్తం అవుతుంది. నీవు దేవుని కుమారుడవు అని ప్రజలు అంటున్నారు. నీవు దేవుడి కుమారుడవు అయితే శిలువలో నుండి బయటకు రా అని యేసును వెటకారంగా అంటారు. ఓ ప్రభువా! వారు ఏమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు, వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అంటాడు యేసు. ఈ ఒక్క వాక్యంతో ఆయన విశ్వవ్యాప్తం అయినాడు. ఎవరైతే ద్వేషంతో తన నెత్తిని తడుపుతున్నారో వారిని ప్రేమతోటి, శాంతితోటి తడుపుతున్నాడు. నీరు పోసిన వెంటనే నిప్పు ఎలా ఆరిపోతుందో, రోగం తగ్గిన వెంటనే ఆరోగ్యం ఎలా వచ్చేస్తుందో అలాగే మనిషి మాలిన్యంలో నుండి బయటకు రావటం వాడికి ఆత్మజ్ఞానం కలగటం ఒకేసారి జరిగిపోతాయి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| జూలై 08 | సాయిబాబా గుడి ప్రాంగణం, చింతపర్రు |
| జూలై 30 | గురుపౌర్ణమి మహోత్సవం, జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమము (జిన్నూరు)

ఉ॥ గం॥ 6-00ల నుండి మధ్యాహ్నం గం॥ 12-00ల వరకు

## సద్గురు దర్శనం

ఉ॥ గం॥ 8-00లకు

## శ్రీ రమణ క్షేత్రంలో భగవాన్ పూజ

మధ్యాహ్నం గం॥ 12-00లకు

## సద్గురు శ్రీ నాన్నగారు
## శ్రీ రమణ క్షేత్రమునకు విచ్చేయుదురు

మ॥ గం॥ 2-30 ని॥లకు

## సద్గురు అనుగ్రహ భాషణములు

**గమనిక :**

**ఉ॥ గం॥ 10-00ల నుండి మ॥ గం॥ 12-00ల వరకు**

**ప్రసాద వినియోగము**



ది॥ 18-06-2007 సోమవారం పాలకొల్లు రామా డిజిటల్ కలర్ లాబ్ ప్రారంభకులు సద్గురు శ్రీ నాన్నగారు, కలర్ లాబ్ యజమాని కావలి తాతయ్యగారు, ప్రత్యేక ఆహ్వానితులు పాలకొల్లు శాసన సభ్యులు సత్యనారాయణమూర్తిగారు, పెనుగొండ శాసన సభ్యులు పితాని సత్యనారాయణగారు, పాలకొల్లు మాజీ శాసన సభ్యులు శ్రీ అల్లు వెంకట సత్యనారాయణగారు